క్లుప్తంగా

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలో 350 మంది వరద బాధితులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. వరదల్లో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు మానవతా దృక్పదంతో దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వట్టి సత్యనారాయణ, వట్టి కృష్ణమోహన్, డాక్టర్ నాదెళ్ల శివకుమార్, డాక్టర్ భవానీ, నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జిటివి. రమణ పాల్గొన్నారు.

గన్నవరం 8వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఏపీపీగా మాధవీ

గన్నవరం: స్థానిక 8వ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా టి. మాధవీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏపీపీగా పనిచేసిన వి. ప్రసన్న నూజివీడు ఒకటవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఉయ్యూరు కోర్టు ఏపీపీగా పనిచేస్తున్న టి. మాధవీని నియమిస్తూ డైరెక్టర్ అండ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ బైరా రామకోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. నూజివీడు కోర్టుకు బదిలీపై వెళ్తున్న ప్రసన్న గన్నవరం కోర్టులో ఐదేళ్ల పాటు ఏపీపీగా పని చేశారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అండగా నిలవాలి

పెనమలూరు: క్యాన్సర్ వ్యాధితో బాధపడేవారికి అందరూ అండగా నిలవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు అన్నారు. కానూరు అమెరికన్ ఆంకాలజీ ఆస్పత్రిలో ఆదివారం రూట్స్‌హెల్త్ ఫౌండేషన్, జై భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ రోజ్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులను రోగులు అనకూడదని, వారిని క్యాన్సర్‌తో పోరాడే ఫైటర్స్ అనాలని పేర్కొన్నారు. రూట్స్ అధ్యక్షుడు పోలవరపు విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మానసికంగా ధైర్యం కల్పించి అండగా నిలవాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ కోట రాజేష్ మాట్లాడుతూ చికిత్సతోపాటు మానసిక ధైర్యం ముఖ్యమన్నారు. కాగా క్యాన్సర్‌తో ఉన్న నలుగురు చిన్నారులకు బొమ్మలు, పండ్లు అందజేశారు. అదేవిధంగా 80 మంది క్యాన్సర్ బాధితులకు పండ్లు, గులాబీలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు కోటా రాజేష్, డాక్టర్ విజయ్, డాక్టర్ క్రాంతిలను సత్కరించారు. కార్యక్రమంలో అన్నే శివనాగేశ్వరరావు, డాక్టర్ పద్మజ, కన్వీనర్ మాధవి, ట్రస్టు సభ్యులు షకినం శ్రీనివాస్, సుధారాణి, విజయలక్ష్మి, శివకృష్ణ, శిరీషా, చందు పాల్గొన్నారు.

కానూరులో వృద్ధుడు అదృశ్యం

పెనమలూరు: కానూరులో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. కానూరు కృష్ణానగర్‌లో కొండపల్లి రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో ఉంటుంది. రాజ్యలక్ష్మి తల్లి ఏడు సంవత్సరాల క్రితం మరణించడంతో నాగాయలంకలో ఉండే ఆమె తండ్రి ఎ. శివరామ ప్రసాదరావు కూడా కుమార్తెతో కలిసి కానూరులో ఉంటున్నాడు. కాగా ఈనెల 12వ తేదీన శివరామ ప్రసాదరావు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో రాజ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

పెనమలూరు: బంగారు ఉంగరాలు దొంగతనం చేసిన వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పోరంకిలో ఉంటున్న మాదాసి జనార్ధనరావు శనివారం స్నానానికి వెళుతూ ఇంట్లోని సోఫాలో రెండు బంగారు ఉంగరాలు ఉంచాడు. అతను స్నానం చేసి వచ్చి చూసేసరికి ఉంగరాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. క్రైమ్ పోలీసుల విచారణలో శ్రీకాకుళం జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన తవిటి రాజు చోరీ చేసినట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా బంగారు ఉంగరాలు పోలీసులకు అప్పగించాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు జారిపడిన వృద్ధుడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఘటనపై మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట టీపీ స్పీ వీధిలోని సీఎస్‌ఐ చర్చి ప్రాంతంలో నందేటి శామ్యూల్(62) కుటుంబం నివాసం ఉంటుంది. శామ్యూల్ కుమారుడు ఏసుబాబు రైల్వే స్టేషన్ క్యాంటీన్‌లో సేల్స్‌బాయ్‌గా పని చేస్తుంటాడు. కొద్ది రోజుల కిందట శామ్యూల్ తన పుట్టినరోజు కావడంతో గొల్లపాలెంగట్టు క్వారీ వద్ద నివాసం ఉంటున్న తన కుమార్తె అరుణ ఇంటికి వెళ్లాడు. ఈ నెల 17న శామ్యూల్ కాలు జారి పడిపోవడంతో గాయాలయ్యాయి. దీంతో శామ్యూల్‌ను వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న శామ్యూల్ ఆదివారం మృతిచెందాడు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు ఏసుబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలువకు గండి.. సాగునీరు లేదండి



దావాజిగూడెం వద్ద ఏలూరు కాలువలో నిలిచిపోయిన నీటి ప్రవాహం



నీరు లేక నెర్రెలిచ్చిన వరి పొలం



అప్పారావుపేట వద్ద కాలువకు గండి పడి వృథాగా పోతున్న నీరు

మండలంలోని కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువకు భారీగా గండి పడి ఇరవై రోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల అప్పారావుపేట పరిధిలోని పంట పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా ఈ గండి వల్ల ఏలూరు కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోయి డెల్టా ప్రాంతంలో తీవ్ర సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వరి పొలాల్లో నీరులేక భూములు నెర్రెలు విచ్చుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువకు పడిన గండ్లను వెంటనే పూడ్చి పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. – గన్నవరం

బాధితుల జాబితాను సరిచూసుకోవాలి

తహసీల్దార్ భావన్నారాయణ

కంకిపాడు: వరద ముంపు బాధితుల జాబితాను సరిచూసుకుని, అభ్యంతరాలను తెలియజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వి. భావన్నారాయణ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కృష్ణానది వరదలు, బుడమేరు ఉధృతంగా పొంగి పొర్లడం, వర్షాలతో మండలంలోని అనేక గ్రామాల్లో భారీ నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వరద ముంపు ప్రాంతాల్లో సర్వే బృందాలు ఇళ్లు, వాహనాల ధ్వంసం వంటి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశాయన్నారు. సంబంధిత బాధితుల వివరాలను 23వ తేదీ సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు వరద ముంపు ప్రభావిత ప్రాంతాలైన ఉప్పలూరు, మంతెన, తెన్నేరు, కుందేరు, కోలవెన్ను, గొడవర్రు గ్రామాల్లోని సచివాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. ముంపు ప్రాంత బాధితులు జాబితాలను సరిచూసుకోవాలని, పేర్లు నమోదు కాకపోతే తక్షణమే ఆయా సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలతో తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను పరిశీలించి అర్హుల పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

24, 25న మండల స్థాయి స్కూల్ గేమ్స్

ఉయ్యూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఈనెల 24, 25 తేదీల్లో ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి జీవీ రమణ తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు తెలుపుతూ 24వ తేదీన అండర్–14, అండర్–17 బాలుర, 25న అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ అంశాల్లో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఔత్సాహికులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



ఉయ్యూరు: గుండెపోటుతో వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ ప్రధాన కార్యదర్శి కొండపల్లి రమేష్(49) కన్నుమూశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని సుందరమ్మ పేటకు చెందిన వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ ప్రధాన కార్యదర్శి కొండపల్లి రమేష్ స్నేహితులతో కలిసి ఈనెల 18వ తేదీ గోవా వెళ్లారు. 21న ఓ రెస్టారెంట్‌లో కుర్చీలో కూర్చుని కుప్పకూలిపోయాడు. దీంతో తోటి స్నేహితులు రమేష్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం అక్కడి ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. సమాచారం అందుకున్న రమేష్ కుమారుడు వినయ్ గోవా వెళ్లాడు. తండ్రి భౌతిక కాయాన్ని సోమవారం ఉయ్యూరుకు తీసుకురానున్నారు.

ప్రసాదంపాడులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు పాత ఎలిమెంటరీ స్కూల్ వద్ద ఆదివారం టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. కాగా విగ్రహావిష్కరణలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఇప్పటికే గ్రామంలో టీడీపీ రెండు వర్గాలు ఉండగా కొత్తగా మరో వర్గం ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం చర్చనీయాంశమైంది. పైగా మండలంలో ఏ ఒక్క టీడీపీ నాయకుడిని కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కూడా పూర్తి కాకముందే టీడీపీలో ఈ వర్గపోరు ఏమిటని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి



పొట్టిపాడు వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ సురేష్

ఉంగుటూరు: వాహన చోదకులు రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఆత్కూరు ఎస్‌ఐ చావ సురేష్ పేర్కొన్నారు. పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద ఆత్కూరు పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా అధికారుల ఆదేశాలతో వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. నిషేధిత బ్లాక్ ఫిల్మ్ వేయించిన కార్లను ప్రత్యేకంగా గుర్తించి వాటి యజమానులకు జరిమాన విధించినట్లు వివరించారు. కార్లు, ద్విచక్రవాహనాలు కలిపి మొత్తం 15 వాహనాలకు రూ. 9,025 జరిమాన విధించామని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



సర్వజ్ఞను అభినందిస్తున్న సూర్యప్రభ, వెంకట్రావు తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తరుపున అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ విద్యార్థిని సర్వజ్ఞ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో సర్వజ్ఞను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు అభినందించారు. సర్వజ్ఞ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం తమ పాఠశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగబోయే 43వ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి నగరానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు అలివేలమ్మ పాల్గొన్నారు.

బహుభాషా గాయకుడు ఎస్పీబీ



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: బహుభాషా గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని సంగీత విద్వాంసురాలు మునిపల్లె రమణి అన్నారు. బాలు స్వర సప్తాహం కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గుంటూరుకు చెందిన ఆర్ ఎస్ ఈవెంట్స్ సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. రమణి మాట్లాడుతూ బాల సుబ్రహ్మణ్యం ఎందరో గాయనీ గాయకులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ మాట్లాడుతూ.. వారం రోజులపాటు బాలు సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. గాయకులు లలిత్‌బాబు, హనుమంతరావు, శ్రీనివాస్, హేమమాలినిలు బాలు పాడిన పాటలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు గాయకులను ఆత్మీయంగా సత్కరించారు. సోమవారం నాటి కార్యక్రమంలో ప్రిన్స్ మెలోడీస్ గాయనీ గాయకులు బాలు చిత్ర గీతాలను ఆలపిస్తారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

జగనన్న వెంటే ప్రజలు

వైఎస్సార్ సీపీ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి



కానూరులో సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

పెనమలూరు: రాష్ట్ర ప్రజలు జగనన్న వెంటే ఉన్నారని వైఎస్సార్ సీపీ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి అన్నారు. కానూరు అన్నే కల్యాణ మండపంలో ఆదివారం పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి గెలుపు రహస్యం అందరికి తెలిసిందేనన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కూటమి 100 రోజుల పాలనలో ప్రజలను ధగా చేసిందని ఆరోపించారు. చంద్రబాబుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ప్రజల చూపు మళ్లించడానికి అనేక కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కార్యకర్తలకు జగనన్న అండగా ఉంటారని తెలిపారు. గుంటూరు–కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా తాను పోటీ చేస్తున్నాని పార్టీ శ్రేణులు తన గెలుపునకు సహకరించాలని కోరారు. పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ కూటమి 100 రోజుల పాలనలో ప్రజలు మోసానికి గురయ్యారని ఆరోపించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మీదట పార్టీ శ్రేణులపై దాడులు చేసినా అక్రమ కేసులు పెట్టినా ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైఎస్సార్‌సీపీ నేతలు రాజులపాటి రామచంద్రారావు, బిందుమాధవి, రామినేని రమాదేవి, మాదు శ్రీహరిరాణి, పి.రాఘవరావు, షేక్.అబుకలాం, జంపాన ఏడుకొండలు, వెలగపూడి వరప్రసాద్, రాచూరి చిరంజీవి, నత్తా వెంకటేశ్వరరావు, అద్దేపల్లి చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుడి ఊరేగింపు



పెనమలూరులో వినాయకుడి ఊరేగింపు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో వినాయకుడి ఊరేగింపు ఆదివారం పెద్ద ఎత్తున చేశారు. గ్రామంలోని పల్లిపేటలో గత 34 సంవత్సరాలుగా వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు ముగియడంతో వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామ పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా కళాకారులు వివిధ రకాల వేశధారణలతో చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. స్వామివారి లడ్డూను గ్రామానికి చెందిన భక్తుడు వనమాల అంజేశ్వరరావు రూ. 65 వేలకు పాట పాడారు. చిన్న లడ్డూ జి. హారిక రూ. 31 వేలకు పాట పాడారు. అలాగే లక్కీ డ్రాతో 20 మంది భక్తులకు వివిధ రకాల బహుమతులు అందజేశారు. 101 శివలింగాలతో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం ఆకట్టుకుంది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోడ్డుకు గండ్లు పూడ్చండి మహాప్రభో..



విజయవాడ-నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో గండి పెట్టిన దృశ్యం



రోడ్డులో ఒకే వైపు వాహనాల రాకపోకలు

నున్న(విజయవాడరూరల్): ఇటీవల వరదలు సంభవించినప్పుడు విజయవాడ–నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు పెట్టిన గండ్లను పూర్తిస్థాయిలో పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. వరద నీటి ప్రవాహాన్ని తగ్గించడానికి పైపులరోడ్డు నుంచి నున్న గ్రామంలోని మ్యాంగో మార్కెట్ వరకు దాదాపు 16 గండ్లు పెట్టారు. బుడమేరు నుంచి అంబాపురం, రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్, ప్రకాష్ నగర్, కండ్రిక, నేతాజీ సుభాస్‌చంద్రబోస్ నగర్ పరిసర ప్రాంతాల్లో వరద నీటిని కిందకు పంపేందుకు పెట్టిన గండ్లు రోడ్డుకు ఒకవైపు తాత్కాలిక మరమ్మతులతో పూడ్చి మరోవైపు వదిలివేశారు. దీంతో విజయవాడ నుంచి పాయకాపురం, కండ్రిక, నున్న, నూజివీడు, సత్తుపల్లి, విసన్నపేట ప్రాంతాలకు ప్రతిరోజూ రాకపోకలు సాగించే వాహనదారులు ఒకవైపు రోడ్డు మార్గంలో వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. వరదలు తగ్గి దాదాపు రెండు వారాలు కావచ్చినా రోడ్డుకు పెట్టిన గండ్లు పూర్తిస్థాయిలో పూడ్చకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ–నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో గండ్లు పూడ్చి డివైడర్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చురుగ్గా దసరా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో క్యూలు, ప్రసాదం కౌంటర్లు, ఆలయానికి రంగులు, కొండచరియలు పడకుండా మెస్‌ల ఏర్పాటు తదితర పనులు కొనసాగుతున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. బాపులపాడు మండలం కానుమోలు చెందిన కాటుమాల కుమార్ అనే యువకుడు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కుమార్‌ను చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ జనార్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దాడి ఘటనపై కేసు నమోదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కొత్తపల్లిలో పాత కక్షల నేపథ్యంలో తోటికోడళ్ల కుటుంబాల మధ్య వైరం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వంగల రాజేశ్వరి, ఆమె కుమారుడు రాజేష్‌పై శనివారం రాత్రి తోటికోడలు వంగల బేబి, ఆమె కుమారులు శివరామకృష్ణ, ప్రసాద్‌లు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయాలైన వంగల రాజేశ్వరి, ఆమె కుమారుడు రాజేష్ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆస్పత్రి వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. బాధితుల వాంగ్మూలం ఆధారంగా ఎస్‌ఐ ఏడీఎల్ జనార్ధన్ విచారణ చేపట్టారు.